Ranga Rao
18/8/84

ఎర్ర సముద్రము

చంద్రశేఖర అజాద్

సముద్ర జలాన్ని చీల్చుకుంటూ ప్రయాణం చేస్తూంది ఆ నౌక.

ఆకాశం నిర్మలంగా వుంది. కెరటాలు లేస్తూ విరిగి పడుతున్నాయి. అనంతమైన ఆ సముద్రంలో ఆ నౌక గొప్ప చిత్రకారుడి చిత్రంలా వుంది.

వాతావరణంలో కనిపిస్తున్న ప్రశాంతత ఆ నౌకలో లేదు. అక్కడ అందరి కళ్ళలోనూ ఆశ్చర్యం తొంగి చూస్తోంది. వారంతా తలవంచుకొని నిలబడ్డ అయిదుగురు నీగ్రోజాతి వ్యక్తులవంక చూస్తున్నారు. వారు నల్లగా వున్నారు. వారి శరీరం దృఢంగానూ కండలు పుష్టిగానూ వున్నాయి. వారంతా నీగ్రోజాతికి చెందినవారు. వారెలా ఆ నౌకలోకి ప్రవేశించారో, పట్టుబడేదాకా ఎలా గడిపారోగాని వారెవరి దగ్గరా టిక్కెట్లు లేవు. వారే దేశం వెళ్ళాలో వారికే తెలియదు. ఏదో ఒక దేశం వెళ్ళి అక్కడ ఆశ్రయం కోరాలని వారు

భావించారు.

ఆ నౌక కెప్టెన్ కళ్ళనుండి మాత్రం నిప్పులు కురస్తున్నాయ్!

అక్కడ నిలబడి చూస్తున్న వారిలో కొందరి నీగ్రోల గురించి అంతగా తెలియదు. వారు పుస్తకాల్లో చదవటమో, సినిమాల్లో చూడటమో జరిగిందిగాని, ఈ రోజు ప్రత్యక్షంగా వారిని చూస్తుంటే అంతులేని ఆశ్చర్యంగా వుంది. మానవ జాతిలో ఇంత నలుపుగా వుండే వ్యక్తుల్ని చూడటం వారికి తొలి అనుభూతి.

నీగ్రోల గురించి వెలువడ్డ అనేక కథలూ, సినిమాలూ వారందరికీ గుర్తొచ్చాయి. నీగ్రోలది బానిస జాతిగా పేరు. ప్రపంచంలోనే వారెదుర్కొన్నంత జాతి విచక్షణ మరెవరూ, ఏ జాతీ, ఆ రూపంలో యెదుర్కోలేదు. ప్రాచీన కాలంనుండి ఈనాటివరకూ అనేక తరాలుగా తమ జాతి వివక్షతకు వ్యతిరేకంగా వారు పోరాడుతూనే ఉన్నారు.

కెప్టెన్ కళ్ళు ద్వేషంతో మండిపోతున్నాయి! అతనికి నీగ్రోజాతి అంటే అంతులేని ద్వేషం. అమెరిన్లన్నా, బ్రిటిష్‌వారన్నా అమితమైన ప్రేమ. వారు తెల్లగానూ, అందంగానూ, హుందాగానూ ఉండి, నాగరికతకూ, ఆధునిక జీవితానికి ప్రతిబింబాలుగా వుంటారనేది అతని దృఢమైన అభిప్రాయం. అందుకే వారిపట్ల ఆరాధనా భావం పెంచుకున్నాడు.

నీగ్రోలమీద అతని కెందుకింత ద్వేషమో అతనికే తెలీదు. ఆ నల్లటి రంగు, ఆ శరీరాల్లో వారు మనుషులుగా కనిపించరు. చాలామంది ప్రాచీన రోమన్లలాగా అతనికి కూడా వారి శరీరాల్ని తూట్లు తూట్లు తూట్లుగా పొడిస్తే

కారే ఎర్రటి రక్తం చూడాలని కోర్కె. కొరడాల్తో బాది బాది అలిసిపోవాలని ఆరాటం. ఎందుకో వారిని చూస్తుంటే మానవుల్తో సహజీవనం చెయ్యటానికి వారి కెలాంటి హక్కు లేదని అతని నమ్మకం.

అర్హత అనే సమస్యే రాకూడదని అతనికున్నా చాలా సందర్భాలలో నీగ్రోలు ఆయనకు తటస్థపడ్డారు. వారంతా నూటుల్లో వుంటే .... తమతో ప్రయాణం చేస్తుంటే అతనికి చాలా అయిష్టంగా వుండేది. అయినా ఏం చెయ్యలేక పోయేవాడు.

ఆ రోజు అతనికి నీగ్రోజాతిమీద తొలిసారిగా చర్య తీసుకునే బంగారు అవకాశం లభించింది. వారంతా నౌకలోకి ఎలా ప్రవేశించారో అంతుబట్టడంలేదు. నౌకలోకి ప్రవేశించటం అంత సులభమయిన విషయంకాదు.

ఏర్పాట్లన్నీ చాలా పటిష్టంగా వుంటాయి. అన్నీ తనిఖీచేసి పూర్తిగా సంతృప్తిచెందితేనే గాని యెవరికయినా ప్రవేశం లభించదు. అలాంటిది యేకంగా అయిదుగురు నీగ్రోలు తమ నౌకలోకి ప్రవేశించటం అతనికి ఆశ్చర్యాన్ని కలగచేస్తోంది. అప్పుడే తమ నౌక బయలుదేరి నెలరోజులు కావస్తోంది. ఇన్ని రోజులు యెవరికీ కనపడకుండా ఎలా గడపగలిగారు?

ఆ రాత్రే భోజనాల గదిలోకి ప్రవేశించి భోజనం దొంగిలించి తీసుకుపోతున్న వ్యక్తిని గమనించి అనుసరించాడు తమ సిబ్బందిలో మనిషి. ఆ పదార్థాలను అవురావురుమంటూ తింటుండగా పట్టుబడి పోయారు.

నౌకలో ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. వివిధ దేశాల ప్రజలు ఆ నౌకలో ప్రయాణం చేస్తున్నారు. ఆ అయిదుగురిని కెప్టెన్ ముందు హాజరు పరిగారు. వారి

వివరాలకోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించాక ఒక్క విషయం మాత్రం తెలుసుకోగలిగాడు.

వారందరిదీ దక్షిణాఫ్రికా!

దక్షిణాఫ్రికాలో శ్వేత జాతి జాత్యహంకారానికి వ్యతిరేకంగా నల్లవారు పోరాడుతున్నారు. అయినా ఆ పోరాటాన్ని అత్యంత దారుణంగా అణిచివేస్తున్నారు. మొత్తం ప్రపంచమంతా ఆ చర్యను నిరసించింది. అయినా ఆ ప్రభుత్వం మామూలుగానే వ్యవహరిస్తోంది. శ్వేతజాతి ప్రభుత్వానికి అనేక రూపాల్లో నిరసన లందాయి. ఒలింపిక్స్‌లో సైతం వారి ఆటగాళ్ళకు ప్రవేశం కల్పించలేదు.

అవన్నీ గుర్తువచ్చి మరింతగా వణికిపోయాడతను. దక్షిణాఫ్రికా శ్వేతజాతీయుల్ని సమర్థించే కొద్దిమందిలో కెప్టెన్ ఒకడు. వారందరికీ ఏదో దేశానికి టిక్కెట్లు తీసుకోవటానికి కొందరు ముందుకు వచ్చారు.

"వార్ని ఏ దేశంలో వదలాలి" అంటూ ప్రశ్నించాను కెప్టెన్.

"వారిష్టం వచ్చిన దేశాల్లో వదలండి. అక్కడి ప్రభుత్వాలు వారికి ఆశ్రయం ఇస్తే సరి. లేకుంటే వేరే చోటుకి పంపుతాయి."

"వారిని తిరిగి ఆఫ్రికాకు పంపితేనూ" అన్నాడు కేప్టెన్.

చివ్వున తలెత్తారు వారంతా!

వారి కళ్ళలో భయం తాలూకు లక్షణాలు కనిపించటంలేదు. ఆఫ్రికన్ అడవుల్లో ఉంటుంది—కింగ్ కోబ్రా. మొత్తం సర్పజాతు లన్నింటిలోకి దాన్ని రారాజుగా భావిస్తారు. ఆరు అడుగులకు పైగా, నల్లగా

వుంటుంది. దాని వేగం అసాధారణంగా వుంటుంది. కోబ్రా కాటుకుగురయితే బ్రతకటమనే సమస్య ఉండదు. మనిషి చావటానికి కావలసిన విషంకంటే రెండింతలు ప్రొడ్యూసవుతుంది. కింగ్ కోబ్రాను చూసినా, ఆ పేరు విన్నా చాలామందికి గుండె గరగరలాడుతుంటుంది.

కెప్టెన్ కు వారి చూపులు అలానే తోచాయి.

"స్టో లెటజ్ డిస్కస్ దిస్ మేటర్ లేటరాన్" అన్నాడు కెప్టెన్.

"గుడ్. ముందు వారికి భోజనం ఏర్పాటు చెయ్యండి. మనది ఏ దేశమయినా మనమంతా మానవులం."

కెప్టెన్ వెర్రి నవ్వు నవ్వాడు.

2

గాఢాంధకారంలో అయిదుగురు కూర్చుని వున్నారు. వారికి ముందు భవిష్యత్ శూన్యంగా కనిపిస్తోంది. అయినా సరే వారెలాంటి పరిస్థితినయినా ఎదుర్కోవటానికి సిద్ధంగా వున్నారు. శ్వేత జాతివారు తమనెలా ట్రీట్ చేస్తారో జ్ఞాపకం తెచ్చుకుంటే అలాంటి జీవితం కంటే మరణమే మేలు. అయితే ఊరికే మరణించటం వలన ఎవరికి ప్రయోజనం ఉంటుంది. మానవులుగా గుర్తింపబడటానికి పోరాడాలి. ఆ పోరాటంలో ఎందరు మరణించినా ఫర్వాలేదు.

నీగ్రోలు వేటాడబడి బానిసలుగా తేబడుతుండేవారు గతంలో. వారిని పశువుల సంతలో అమ్మినట్లుగా అమ్మటం, కొనటం జరిగేది. రాను రాను పరిస్థితి యెలా తయారయిందంటే ఈ బానిసలు లేనిదే ఏ పని చేయటం సాధ్యం కాకుండా పోయింది. బానిసలే వారి ఆస్తి. తిరిగి వారికి పుట్టేవారు కూడా ఆస్తిగానే పరిగణించ

బడేవారు. స్త్రీలనయితే తమ కామానికి గురిచేసేవారు. ఇలాంటి వాటిని చరిత్ర గతిలో వారు భరించలేక పోయారు.

బానిస యజమానులకు అనుకూలంగా ఎన్ని చట్టాలు తేబడ్డా, బానిస పోరాటాల్ని ఎంత క్రూరంగా అణిచి వేసినా స్పార్టకస్ కాలంనుండి చరిత్రలో అనేకానేక పోరాటాలు జరిగిపోయాయి. రక్తతర్పణాలు.. త్యాగాలు ఒకటేమిటి కనీస మానవ హక్కులకోసం.... స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం వారెందరో శవాలుగా మారి పోయారు.

వారు స్వేచ్ఛ సాధించుకున్నాక వారంతా విశాల ప్రపంచంలోకి వచ్చారు. నీగ్రో జాతినుండి మేధావులు, రచయితలు, కళాకారులు, ఆటగాళ్ళు ప్రపంచం ముందు కొచ్చారు.

ప్రపంచంలో ఏ జాతీ వెనకబడి వుండదని, ఏ జాతీ మరో జాతికంటే ఎక్కువయినది, తక్కువయినది కాదని, యెక్కడ అవకాశాలు ఉన్నా అక్కడ సృజనాత్మక శక్తులు విస్తరించగలవని, ఏ జాతికి చెందిన సంస్కృతి వారికి ప్రత్యేకంగానూ ఉంటుందని, అన్ని జాతుల హక్కుల్ని, అస్థిత్వాన్ని ప్రత్యేకతల్ని గుర్తించాలని వారు ఋజువుచేశారు.

శ్వేత జాతి వాతబడ్డ భారతీయులు కూడా అనేక విధాలుగా అవమానించబడ్డారు. ఆ అవమానాలకూ, అక్రమాలకూ, కలస దోపిడికి వ్యతిరేకంగా, విస్తృతంగా ప్రజానీకం కదిలింది. బ్రిటిష్ పాలకుల పునాదులు కదిలి పోయాయి. రవి అస్తమించని సామ్రాజ్యంలో చీకట్లు నెలకొన్నాయి.

శ్వేతజాతి జాత్యహంకారాన్ని ప్రపంచం అసహ్యించుకుంది. వారి విష కౌగిలినుండి బయటపడి స్వేచ్ఛా వాయువులు పీల్చారు జనం.

ఉరికొయ్యలు, చెరసాలాలు, తుపాకులు, బాంబులు, ఏవీ వారి స్వేచ్ఛా పిపాసను అణచలేకపోయాయి.

అయినా ఆ సర్పం చావలేదు!

కొన ప్రాణంతో తోక జాడిస్తూనే వుంది!

అందుకు సజీవ ఉదాహరణ దక్షిణాఫ్రికా.

శ్వేతజాతి జాత్యహంకార ప్రభుత్వం!

శ్వేత జాతీయుల జాతి వివక్షతను ఆ దేశ ప్రజలయిన నల్లవారు భరించలేకపోయారు. అందుకని ఓ రాజకీయ పార్టీగా ఏర్పడి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసం పోరాడాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ పార్టీని ప్రభుత్వం గుర్తించటానికి ఇష్టపడలేదు.

ఆ అయిదుగురి కళ్ళముందు కనపడుతున్నాడు.

బాబీశాండ్స్!

బాబీశాండ్స్‌తోపాటు మరికొందరిని అరెస్టు చేసింది ప్రభుత్వం. అయితే వారెవరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించకుండా సాధారణ నేరస్థుల మాదిరిగా ట్రీట్ చేయటం ప్రారంభించింది. అందుకు నిరసనగా, రాజకీయ ఖైదీగా గుర్తింపుకోసం నిరాహారదీక్ష ప్రారంభించారు బాబీశాండ్స్, అతని సహచరులు.

రోజులు గడుస్తున్నాయి. అయినా ప్రభుత్వం చలించలేదు. ప్రపంచం నలుమూలలనుండి అనేక దేశాలు విజ్ఞప్తి చేశాయి. వారంతా రోజు రోజుకూ చిక్కి శల్యమై పోయారు.

ఏభై రోజులు పైబడి... రాజకీయ ఖైదీగా గుర్తింప

బడక.... జైలు గోడల నడుమ..ఇనుప చువ్వల నడుమ... ఉరికొయ్యల సాన్నిహిత్యంలో తమ ప్రభుత్వంకంటే ఎంతో మేలయిన వాటి ప్రక్కన, స్వేచ్ఛా వాయువులు మాత్రమే పీలుస్తూ... కోమాలోకి జారిపోయి ప్రాణాలు వదిలాడు బాబీశాండ్స్! ఆ తర్వాత మరికొందరు!

మానవ జాతి హక్కుల్ని ఆ విధంగా కాలరాస్తున్న వారినెంతగా అభిశంసిస్తున్నా ఆ శ్వేత జాతీయులు లెక్క చెయ్యలేదు. నిస్సిగ్గుగానూ, నిరంకుశంగానూ ఆ పోరాటాన్ని అణిచివేయటానికే నిశ్చయించుకున్నారు.

వారి కళ్ళవెంట నీళ్ళు జారిపడ్డాయి. ఆ అయిదుగురు తమ సంస్థ తరఫున తమ సమస్యలను ప్రపంచ ప్రజల ముందుంచటానికి వారినుండి ఆర్థిక, రాజకీయ, నైతిక సహాయం పొందాలని బయల్దేరారు. కాని దురదృష్ట వశాత్తు వారిదగ్గర డబ్బులేదు. సాహసించి దొంగచాటుగా నౌకలో ప్రవేశించారు....

కెప్టెన్ తన గదిలో అటూ, ఇటూ తిరుగుతున్నాడు. ఆయన నోటిలోని పైపు గుప్పు గుప్పుమంటోంది. అతనికి ఏం చేయాలో అర్థంకావటంలేదు. వాళ్ళలా దొంగ తనంగా వచ్చారంటే ఆ ప్రభుత్వానికి ప్రమాదకరంగానే పరిణమించి వుండవచ్చు. వారిని తిరిగి అప్పగిస్తే బాగుం టుంది. వెధవల్ని చక్కగా ఉరితీస్తారు!

వీరు బ్రతికుంటే యే దేశమో ఆశ్రయం ఇస్తుంది. వారి కోర్కెలకు ప్రాధాన్యత ఏర్పడుతుంది. వీరి పోరాటాన్ని అక్కడినుండే కొనసాగిస్తారు. ఆర్థికం గానూ, నైతికంగానూ వారికి ప్రపంచపు అండదండలు లభిస్తాయి. మరేం చెయ్యాలి? ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. కాగా వీరిని ఏం చేస్తే బాగుంటుంది

అనుకున్నాడు.

అతని పెదవులమీద వికృతమైన నవ్వొకటి మెరిసింది. నోటిలోనుండి పైపు బయటకు తీశాడు. తన అనుచరుడ్ని పిలిచాడు. అతని చెవిలో ఏదో చెప్పాడు. అత్యంత రహస్యంగా కార్యక్రమం జరిగిపోయింది.

సమయం దాదాపు రెండు గంటలవుతోంది. ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. వెన్నెల వెలుగులు సముద్ర జలాలమీద పడుతున్నాయి. అలలు నిర్విరామంగా ఎగిరెగిరి పడుతున్నాయి. కెప్టెన్ నోట్లో పైపు నిర్విరామంగా గుప్పు గుప్పుమంటూనే వుంది.

అయిదుగుర్ని నౌక పైభాగానికి చేర్చారు.

కెప్టెన్ ఆ వెలుగులో వారివంక చూశాడు.

"నల్లవారెందుకు పుట్టారో తెలుసా? బానిసలుగా వుండటానికి. అది మీ కర్మ. మీరే జన్మలోనో పాపం చేసుకున్నారు. లేకుంటే మీరు తెల్లవారిగా పుట్టేవారు. మీరెంత అరిచి చచ్చినా మీరిలా బానిసల్లా చావాల్సిందే. మిమ్మల్ని బానిసలుగా మించి మరో దృష్టితో చూడం. మీరీ నౌకలోకి దొంగతనంగా ప్రవేశించారు. ఇది చాలా దారుణమైన విషయం. అంతేకాదు. మీరీ నౌకని ప్రేల్చేయాలని కుట్రపన్నారు. అందుకే మీకు శిక్ష విధిస్తున్నా" అన్నాడు కెప్టెన్.

అతని కళ్ళు నల్లగా వున్నాయి. ఆ వెలుగులో పరమ భయంకరంగా కనిపిస్తున్నాడు.

"విసరండి" ఆజ్ఞాపించేడు.

అంతే! బలవంతంగా ఒక్కొక్కర్ని సముద్రంలోకి త్రోసెయ్యటం ప్రారంభించారు!

వారు క్రిందకు వాలిపోతూ వేసిన కేకలు ప్రకృతిలో

ప్రతిధ్వనించాయి!

నౌక మాత్రం ముందుకు పోతూనే వుంది.

నౌక అంచునుంచి క్రిందకు చూచిన కెప్టెన్ కళ్ళకు ఏం కనపడటంలేదు.

అతని పెదవులమీద క్రూరంగా నవ్వు!

తృప్తిగా వెనక్కు తిరిగాడు.

3

సముద్రంలోకి విసిరి వేయబడ్డాక ఆ అయిదుగురు నీగ్రో యువకులు ఒక్కసారిగా అడుక్కిపోయారు. యెక్కడి సముద్రం....ఆ లోతులు చూడటం ఎవరికి సాధ్యం.... అదృష్టవశాత్తూ వారందరికీ ఈత చేతవును. అయితే మాత్రం ఎంతదూరమని ఈదగలరు. వారికి అంతులేని ఆశ్చర్యాన్ని బాధనూ కలిగిస్తున్న అంశం తమని అంత నిర్దాక్షిణ్యంగా సముద్రజలాలకు ఆహుతికమ్మని విసిరేయటం.

ప్రపంచ ప్రజలంతా మానవత్వంతోనూ, సానుభూతితోనూ తమను అర్థం చేసుకోగలరని, తమ పోరాటానికి మద్దతు యివ్వగలరని భావించారేగాని, ఇలాంటి పరిస్థితి ఎదురవ్వగలదని వారు కలలో కూడా ఊహించలేదు. అంతకన్నా తమను తమ ప్రభుత్వానికి అప్పగించినా బాగుండేది. ఆ ఉరికంబాలకు ఆహుతి కావటం జరిగినా తిరిగి మరోసారి ప్రపంచ అభిప్రాయం మార్మోగేది. కానీ ఇలా అనాథల్లా....దిక్కులేని చావు చావటం యెంత దుర్భరం అనుకున్నారు.

అయితే వారి ఊహాలు సొంతం నిజంకావు. తెల్లవారగానే ప్రయాణీకులంతా కెప్టెన్‌ను నిలదీశారు. వారి సంగతి చెప్పమన్నారు. నాకేం తెలియదంటూ బుకా

యించబోయాడు. కానీ వాళ్ళు వూరుకోలేదు. కొందరయితే గబగబ వెళ్ళి గాలినింపిన ట్యూబ్స్‌ను.. చెక్కల్ని కొన్నిటిని నీళ్ళలోకి విసిరేశాడు.

ఏం లాభం. వాళ్ళనెప్పుడు తోశేశాడు.

ఈపాటికి శవాలుగా మారి ఉంటారు.

కెప్టెన్ దురాగతం సభ్య ప్రపంచానికి తెలిసిపోయింది. దిగ్భ్రాంతితో అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. అతన్ని తీవ్రంగా అసహ్యించుకున్నారు.

ఆ కెప్టెన్ మాతృభూమిలోనే ఓ నీగ్రో యువకుడు అతన్ని కాల్చి తమ జాతి పగ తీర్చుకున్నాడు.

4

ఉదయం ఎనిమిదిగంటలవుతోంది.

అప్పటికి ఆరుగంటలనుండి ఈదుతున్నారు అయిదుగురు. వారికి బ్రతుకుమీద ఆశ లేదు. అనంతమైన సముద్రాన్ని చూస్తుంటే వారికి బ్రతికి బయటపడగలమనే ఆలోచన సైతం రావటంలేదు. అయినా వారు ఈదుతూనే వున్నారు. తుది క్షణందాకా జీవితంకోసం బ్రతుకుతూ పోరాడాలనేది వారి సిద్ధాంతం! యేదో అద్భుతం జరిగితేగాని వారు బ్రతికి బయటపడటం జరగదు. అద్భుతాలు తరచుగా జరగవు.

ఈదుతున్న అయిదుగురిలో ఓ వ్యక్తి బాగా అలిసిపోయాడు. అప్పటికే మిగతావారికీ అతనికి నడుమ దూరం పెరిగింది. ముందున్న వారంతా వెనక్కి తిరిగి చూశారు. తమ సహచరుడు ఈదలేక మెల్లగా బార్‌లు వేస్తున్నాడు. గబుక్కున వెనక్కి తిరిగి అతని దగ్గర కెళ్ళారు.

ఆ యువకుడి కళ్ళు యెర్రగా తయారయినాయి.

అప్పటికే రెండుమూడుసార్లు ఉప్పునీళ్ళు త్రాగాడు. అంతులేని దాహంగా వుంది. పెదవులు తడుపుకుంటు న్నాడు. మరీ ఇంక భరించలేననుకున్నప్పుడు ఆ నీటికి పుక్కిలించి ఊస్తున్నాడు.

"జెర్రీ....మమ్మల్ని పట్టుకో" అన్నారు.

"నో" అరిచాడు జెర్రీ.

"ప్లీజ్" అభ్యర్థించారు.

"ఫ్రెండ్స్. మీరు నాకోసం చూడకండి. మీరు అనంతమైన ఈ సముద్రాన్ని ఈదాలి. మీలో ఒకరైనా బ్రతికి బయటపడాలి. ఎంత దూరమని నన్ను తీసుకెళ్తారు" అన్నాడు జెర్రీ.

"కొంత దూరం తీసుకెళ్తాం. తిరిగి నువ్వు ఈదగలవు."

"లేదు. ఒకసారి ఈదటం ఆపితే తిరిగి ఈదటం సాధ్యంకాదు. దయచేసి మీరు ముందుకు వెళ్ళండి."

"వీల్లేదు. నిన్నిలా ఒంటరిగా మృత్యువుకొదిలి మేం వెళ్ళలేం" వాళ్ళలో ఓ వ్యక్తి అన్నాడు.

జెర్రీ కళ్ళు ఒక్కసారిగా ప్రేమభావంతో నిండి పోయాయి. వెంటనే కఠినంగా మారిపోయా డతను.

"ఐ హేట్ యువర్ బ్లడీ సెంటిమెంట్స్....మీ అందరికీ ఇలాంటి సెంటిమెంట్సున్నప్పుడు విప్లవంలోకి రావాల్సింది కాదు. పెళ్ళిచేసుకొని పిల్లల్ని కంటూ శ్వేత జాతికి శుశ్రూష చేస్తూ బ్రతకాల్సింది. యూ నో బాబీ శాండ్స్ చచ్చిపోయాడు. మన స్నేహితుల్ని ఉరితీసి ఎన్నోరోజులు కావటంలేదు. వారందరితోబాటు మనమూ పోయామా? లేక వారిని రక్షించటానికి మూర్ఖంగా వెళ్ళామా? విప్లవం అంటే ఏమిటనుకున్నారు. అవి వ్యక్తుల్లో నిలిచేవి కావు. ఓ వ్యక్తి పోతే మరొకడు,

ఇంకొకడు, వేలాది జనం పుట్టుకొస్తారు. ఒక వ్యక్తికోసం విప్లవానికి ద్రోహం చెయ్యటం క్షమించరాని నేరం" కఠినంగా అన్నాడు జెర్రీ.

"జెర్రీ" బాధగా మూలిగారు.

"మీ బాధను నేను అర్థం చేసుకోగలను. మనందరమూ కలిసి చావాలనే కోర్కె నెరవేరదు. మన ఆశయాలు మాత్రమే మనల్ని ఐక్యంగా ఉంచగలుగుతాయి. అంతే గాని ఓసారి పోరాటంలో దిగాక, మిగతావన్నీ మనకు అనుకూలంగా ఉంటాయని భావించటానికి వీలులేదు. పోరాటంలో పెళ్ళాం బిడ్డల్ని, తల్లి తండ్రుల్ని కోల్పోయిన వారెందరో వున్నారు. అలాంటి వారందరినీ గుర్తు తెచ్చుకోవాలి. సోదరులారా! శెలవ్! మీరంతా ముందుకు పోండి. ఏదైనా అద్భుతం జరిగి మనలో ఎవరు మిగిలివున్నా అక్కడ వుండే శ్వేత జాతిమీద పోరాటం మొదలు పెట్టండి. మీరు వెళ్ళండి."

వాళ్ళు గుండె దిటవు చేసుకున్నారు.

"వెళుతున్నాం జెర్రీ. మన అమరవీరుల బాటలోనే మేం పయనిస్తాం. మేం బ్రతికుండటం జరిగితే శ్వేతజాతి మీద మన హక్కులకోసం పోరాడుతాం."

"శ్వేతజాతి జాత్యహంకారం" జెర్రీ ఆవేశంగా అరిచాడు.

"నశించాలి"

"విప్లవం."

"వర్థిల్లాలి."

సముద్రంలో చైతన్యం!

"మిత్రులారా వీడ్కోలు" జెర్రీ చేయి ఊపాడు. వారు ముందుకు కదిలిపోయారు. జెర్రీకి నీరసం ఆవ

హిస్తోంది. దూరంగా అతని మిత్రులు ఈదుకుంటూ పోతున్నారు.

జెర్రీ ఇంక ఈదలేననుకున్నాడు. అతని కళ్ళు మండుతున్నాయి. సముద్ర జలాలమీద సూర్యుడి వెలుగులు పడుతున్నాయి. ఆ కిరణాలకు సముద్ర కెరటాలు మెరుస్తున్నాయి.

జెర్రీలో తెలియని భావావేశం.

మాతృభూమీ నీకు వీడ్కోలు! నీగ్రో జాతిలో పుట్టినందుకు నేను బాధపడటంలేదు. పోరాటంలో చచ్చిపోతున్నందుకు అసలే దిగులులేదు. నీగ్రోజాతి మానవ జాతికి మచ్చకాదని, వారికి సంస్కృతిలేదని, వారు బానిసల్లానే బ్రతకాలనే వాదనలకు ఈ రోజు ప్రపంచంలో బలంలేదు. అవన్నీ ఖండించబడ్డాయి. ఈ రోజు చరిత్ర గమనంలో అందరితోపాటు నీగ్రోజాతి వారు తమ వంతు మనుగడను సాగిస్తున్నారు. అయితే నా మాతృ భూమిలో ఇంకా వివక్షత సాగించవచ్చు. మాలో చాలామందిని ప్రభుత్వం చంపి వుండవచ్చు. కానీ చరిత్ర పుటల వెనక్కు వెళ్ళిన అనేక మందిలానే ఈ శ్వేతజాతి ప్రభుత్వం నాశనమై తీరుతుంది. దక్షిణాఫ్రికాలో నీగ్రో జాతీయులు తలెత్తి స్వేచ్ఛావాయువులు పీల్చి తీరుతారు. మాతృ భూమీ మరోసారి వందనాలర్పిస్తూ....వీడ్కోలు తల్లీ.

5

ఈదుతున్న మొటాంగో ఆలోచనలు పరిపరి విధాల పరుగెడుతున్నాయి.

జెర్రీని వదిలి వారు చాలాదూరం వచ్చారు. ఇప్పటికి పదిగంటలనుండి ఈదుతున్నారు.

మొటాంగోను గజ ఈతగాడుగా పేర్కొనవచ్చు. ఒకసారి ఇరవై నాలుగు గంటలు వరుసగా ఈది రికార్డు సృష్టించాడు. దృఢమయిన శరీరం, చురుకయిన కళ్ళుకల మొటాంగో కూడా ఈ సాగరంనుండి బయటపడగలమని భావించటంలేదు. అంతటి స్థితిలోనూ వారికి బాధ కలిగించే విషయం, తమ పరిస్థితి ఇలా కావటమే.

ఈదుతున్న మొటాంగో యధాలాపంగా వెనక్కి తిరిగాడు. అంతే.... చివ్వున వెనక్కి తిరిగాడు.

అంతరంగం తీవ్రమైన బాధకు లోనయింది.

“వెళ్ళకు” “వెళ్ళకు” అని మనసు హెచ్చరిస్తోంది.

అయినా బారలు వేసుకుంటూ ముందుకెళ్ళాడు.

అప్పటికే ఆ ప్రాంతమంతా అల్లకల్లోలంగా వుంది.

సొర చేప దాడి చేసింది.

మొటాంగో ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

ఎర్రని రక్తపు చుక్కలు మెల్లగా నీటిమీదకు తేలటం ప్రారంభమయ్యాయి.

నీటిలో కల్లోలం ఆగిపోయింది.

మొటాంగో అదృష్టం .... సొర చేప ఆ యువకుడ్ని లాక్కొని వెళ్ళిపోయింది.

మొటాంగో ముందుకు చూశాడు.

దూరంగా తన మిత్రుడొకడు మాత్రమే కనిపిస్తున్నాడు.

మరో యువకుడు కనిపించటంలేదు.

అతనేమైపోయాడు!

గుండెలు పిండినట్లయింది. తన కళ్ళముందు ముగ్గురు బలయిపోయారు. సొర చేపలు తిరిగే ప్రాంతంనుండి

బయటపడటం అసాధ్యం. అందులోనూ రక్తం వెలువడింది. ఆ వాసనకు దూరంనుండికూడా రాగలవు. పెద్ద బారలు వేసుకుంటూ అతన్ని కలిశాడు.

"ఫ్రెడ్ మనం ఈ ప్రాంతంనుండి త్వరగా వెళ్ళిపోవాలి. లేకుంటే ఈ సొరచేపలకు మనమూ ఆహారమవుతాం."

ఫ్రెడ్ విరక్తిగా నవ్వాడు.

"మొటాంగో, సొరచేపలకు కాకుంటే మరోవాటికి మనం ఆహుతికాకుండా వుండగలమని నమ్ముతున్నావా?"

"ఖచ్చితంగా."

"నీ విశ్వాసం నాకు నవ్వు తెప్పిస్తోంది."

"మన ఉద్యమం....ఆశయాలూ నవ్వు తెప్పించటం లేదా ఫ్రెడ్."

"మొటాంగో నా నిజాయితీని శంకించటం దారుణం."

"లేదు ఫ్రెడ్. ఆ అర్థంలో నిన్నడగటంలేదు. సముద్రాన్ని మన శత్రువుతో పోల్చుకో. మన శత్రువు అంత బలంగా వున్నాడు. మన ఉద్యమం ఆ బలంతో పోల్చుకుంటే బాల్యదశలో వుంది. అయినా మన పోరాటం విజయవంతం కాగలదనే మనం నమ్ముతున్నాం. ఆ పోరాటంలో మనవాళ్ళ నెందరినో కోల్పోయాం. అయినా మన పోరాటం ఆగలేదు.... ఇప్పుడూ అంతే....ఆ భావమే మనల్ని సాగరాన్ని ఈదిస్తుంది. మనకిప్పుడు కావాల్సింది మంచినీరూ....ఆహారం కాదు, ఆత్మవిశ్వాసం."

ఫ్రెడ్ చలించిపోయాడు.

"మొటాంగో నీ మాటలు నాలో క్రొత్త ఊపిరి పోశాయి. నిజమే, మనం ఈ సముద్రాన్ని, సొరచేపల్ని జయించితీరాలి. నాకు నమ్మకం ఇప్పుడు కుదిరింది. మరో

రెండురోజులు ఈదగలను."

"గుడ్ .... ఫ్రెడ్ నీ దగ్గరేమైనా ఆయుధం వుందా?"

"మొలలో చిన్న బాకు వుంది మొటాంగో."

"చాలు. ఆ మాత్రం ఆధారం వుంటే మనం ఆత్మ రక్షణ చేసుకోగలం. ఎందుకయినా మంచిది—అది అందు బాటులోకి తెచ్చుకో. యే క్షణం యెలాంటి అవసరం కలుగుతుందో."

"అలాగే మొటాంగో. నీ దగ్గరేముంది."

"నా దగ్గర అంతకంటే ఏం లేవు. మన బ్యాగ్ లో దాచుకున్న అమ్యూనిషన్ ....కొద్దిపాటి డబ్బు నౌకలోనే ఉండిపోయాయి."

"ఆ క్రావెన్ ఎంత నిర్దయుడు."

"ఫ్రెడ్ ప్రపంచమంతటి జనంలో అలాంటివా రుంటారు. ప్రపంచంలోని జనమంతా ఎలా దుర్మార్గులు కారో, అలాగే ప్రపంచంలోని మనుషులంతా మంచి వారూ కాదు."

"మనం మానవ జీవితంలోని వివిధ కోణాల్ని ఇలా సముద్రంలో చర్చించుకోవటం వింతగా వుంది కదూ."

"అవును. మనకు నాలుగు ప్రక్కలా నీళ్ళున్నాయి. దాహ మేతీరంది" అంటూ మొటాంగో ఒక్క గుక్క త్రాగి పుక్కిలించి ఊశాడు.

ఆ తర్వాత వారిద్దరూ మాట్లాడుకోలేదు. వారి దృష్టి అంతా యెంత త్వరగా ఆ ప్రాంతంనుండి బయటపడ దామా అన్నట్లుంది. వేగంగా ముందుకు సాగిపోయారు.

అయితే ప్రమాదం వారి వెంట నడిచి వస్తోందని వారికి తెలియదు.

సరిగ్గా గంట తర్వాత....

"మొటాంగో" అరిచాడు ఫ్రెడ్.

అప్రయత్నంగా మొటాంగో చెయ్యి బాకు మీద పడింది.

"ఫ్రెడ్."

"బీ రెడీ" అంటూనే నీళ్ళలోకి చటుక్కున మునిగాడు. సొరచేప వస్తున్న విసురుకు నీళ్ళు మోటాంగోన ప్రక్కకు నెట్టాయి. అంతలోనే తేరుకొని బారలు వేసుకుంటూ వచ్చాడు. చేతిలో బాకు పదునుగా వుంది.

ఫ్రెడ్ కు సొరచేప తాలూకు శరీరం కనిపిస్తోంది ఆదే భాగమో కూడా అర్థం కావటంలేదు. చేతిలో బాకున కసిగా గుచ్చాడు. చివ్వున రక్తం బయటకు వచ్చింది— నీళ్ళలో కలిసిపోతూ. సొరచేప బాధగా కదలబోయింది ఆదే క్షణం మొటాంగో చేతిలోని బాకు పొట్టక ప్రక్కగా దిగింది. అంతటితో ఊరుకోక బలంగా చీరేశాడు. రక్తం వెల్లువలా బయటకు తన్నింది.

చేప గిలగిలలాడిపోయింది. వారికి దాన్ని చూస్తున్న కొద్దీ తమ అనుచరుడు గుర్తుకొచ్చి మహోద్రేకం కలిగింది. ఇరువైపులా దాన్నెదుర్కొంటూ అందినచోటల్లా పొడవటం ప్రారంభించారు. శరీరంనుండి ధారాళంగా రక్తం కారిపోతుండటంతో దాని శక్తి క్రమంగా క్షీణించిపోసాగింది. ఇంక వుంటే తన ప్రాణాలు పోగలవని భావించింది. వారి నెదుర్కొనే ప్రయత్నం మాని గిర్రున వెనక్కు తిరిగింది. ముందుకు దూసుకుపోయింది. నీళ్ళు ఎర్రగా మారిపోతున్నాయి. ఆయాసంగా నీటిమీదకు చేరుకున్నారిద్దరూ.

"ఫ్రెడ్ నీకేమైనా గాయాలు తగిలాయా?"

"అదృష్టవశాత్తూ లేవు మొటాంగో. నీకేమైనా."

"నాకూ అంతే."

"సముద్రం ఎర్రబడుతోంది మాశావా."

"ప్రపంచంలో యెక్కడో ఎర్రసముద్రం వుందని నేను విన్నాను."

"ఇదీ మన పాలిటి ఎర్రసముద్రమే!"

"ఈ సొరచేప రక్తానికి మరిన్ని రావుకదా."

"లేదు. ఈ ప్రాంతాల్లో సొరచేపలు అంతగా సంచరించవు. బహుశా ఇదొక్కటే ఉండుంటుంది. మన ఖర్మకొద్దీ మనల్ని పట్టుకోవటానికి వచ్చింది. సొరచేపలు యెక్కువగా తిరిగితే ఇప్పటికే మనమీద దాడిజరిగేది."

"కావచ్చు" అన్నాడు ఫ్రెడ్.

వారి శరీరాలు ఉప్పుమూలంగా గట్టిపడిపోయినట్లున్నాయి. వారి వెంట్రుకలు బిగుసుకొని వున్నాయి.

"దాహంగా వుంది మొటాంగో."

"నాకూ అలానే వుంది. ఏం చెయ్యగలం."

ఇద్దరూ నవ్వుతున్నారు.

6

"మొటాంగో నా శక్తి క్షీణిస్తోంది. అంతకంటే యెక్కువగా దాహంగా వుంది."

"ఫ్రెడ్ నిరాశపడకు. మనకు ఏదో ఒక ఆధారం దొరుకుతుందని నా మనసు చెబుతోంది."

"నాకు నమ్మకం కలగటంలేదు మొటాంగో. నన్ను క్షమించు."

"ప్లీజ్ ఫ్రెడ్ నిరాశపడకు" అభ్యర్థించాడు మొటాంగో.

అంతకంటే ఏంచేయాలో అర్థంకావటంలేదు. అసలా ప్రాంతం ఏదో కూడా అర్థంకావటంలేదు! యే తీరప్రాంత

మయినా అయితే ఆయా దేశాల జాలర్లు చిన్న పడవుల మీద చేపల వేటకు వస్తుంటారు. వారికి ఎలాంటి నౌకలు కూడా కనపడటంలేదు.

ఎటు చూసినా నీళ్ళు!

“మొటాంగో .... ప్లీజ్ నువ్వు ముందుకెళ్ళు. నేను ఈదలేను” ఫ్రెడ్ వేగం క్రమంగా తగ్గిపోయింది.

“నో....నువ్వు నన్ను పట్టుకో. నీలో అలుపుతీరాక తిరిగి ముందుకు పోదాం.”

“ఎంత దూరం వెళ్ళగలం. మొటాంగో నాకోసం నువ్వాగకు.”

“నేనలాంటి మాటలు వినదలుచుకోలేదు. ఇంతవరకూ నువ్వు తోడుగా వున్నావు కాబట్టి, ఇంత దూరం రాగలిగాను. ఒంటరిగా అయితే నాలోనూ నిరాశ పేరుకుపోయేది. నేనూ ఈ నీటిలోనే సమాధి అవుతాను. ఫ్రెడ్ నా మాటకు ఎదురుచెప్పకు. మనం కలిసే చావాలనేది నా ఆఖరి కోర్కె.”

ఫ్రెడ్ మాట్లాడలేకపోయాడు.

మొటాంగో ఫ్రెడ్ దగ్గర కొచ్చాడు.

ఇప్పుడు ఫ్రెడ్ కు కొంత ఊపిరి చిక్కింది.

మొటాంగోకు మరింత భారం అధికమయ్యింది. అయినాసరే సంతోషంగా ముందుకు పోతూనే వున్నాడు.

రోమన్ సామ్రాజ్యంలో బానిసలిరువుర్ని యెదురెదురుగా ఉంచేవారు. వారి కండలు....పిక్కలు.... అత్యంత బలంగా వుండేవి. నల్లటి శిల్పాల్లా వుండేవారు. వారు పట్టుకున్న బరిసె మొనలెంత పదునుగా వుండేవో వారంత చురుకుగా వుండేవారు. నీగ్రో జాతీయులకు మొదటినుండి జీవన్మరణ సమస్య. వారి చరిత్ర అంత

రక్తసిక్తమయింది. రోమన్ పౌరులు ఆ క్రీడల్ని చూడటానికి ఎంతో ఉత్సాహపడేవారు. రంగంలో వుండేది ఇద్దరు. ఇరువురూ బానిసలే. ఎవరో ఒకరి మరణంతో ఆ క్రీడ ముగిసేది.

వారిరువురు ఎదురెదురుగా.. బ్రతుకుకోసం పోరాటం. ఒకరు బ్రతకాలంటే మరొకరు చావాలి. ఓ వేళ ఈ పోరాటంలో గెలిచినా అది తాత్కాలికమే. మరో పోరాటంలో ఇంకో బలవంతుడి చేతిలో హతంకాక తప్పదు.

వారు జీవించటానికి పడే ఆరాటం చూసేవారికి ఆనందాన్ని కలిగించేది. వారి కసి ఎవరిమీదో! అయినా యాంత్రికంగా కదిలేవారు. వాళ్ళ చేతులు కదిలేవి. ఆయుధాలు కదిలేవి. శరీరాలను చీల్చుకుంటూ....రక్తపు ధారలతో....వారిద్దరూ పోరాడుతుండేవారు. యెవరో ఒకరు కూలిపోయేవారు.

హర్ష ధ్వానాలు.

వికృతానందం.

నిర్లిప్తంగా కూలిపోయిన తన సోదరుడివంక చూపులు.

అమెరికాలో మరింకొంత భిన్నంగా వుండేది. ఆఫ్రికా నుండి సైతం మనుషుల్ని తెచ్చి బానిసలుగా అమ్మేవారు. వారెప్పుడైనా పారిపోవటానికి ప్రయత్నిస్తే అంగ విచ్ఛేదనం చేసేవారు.

తరతరాల బానిస చరిత్రలన్నీ హృదయవిదారకం.

మానవత్వానికి తీరని మచ్చలు.

వారి జీవితాల్లో వెలుగు ప్రసరింపచేయటానికి యెన్ని పరిమితుల్లోనయినా కృషిచేసిన మహనీయులు తుపాకి తూటలకు గురి అయ్యారు. అయినా ఆ అవశేషాలు మిగిలే

వున్నాయి. ఆ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి.

మొటాంగో వాటికే ప్రతినిధిలా వున్నాడు.

అతనికి అంతులేని దాహంగా వుంది. వెంటనే మంచి నీళ్ళు త్రాగకపోతే ప్రాణం పోతుందేమోననుకున్నాడు. ఒక్కసారి బలవంతంగా గుక్కెడు నీళ్ళు మింగాడు. ఆకలి కరకరలాడ్తోంది. కడుపులోకి వట్టి నీళ్ళు మాత్రమే పోతుండటంతో అంతులేని నొప్పి మొదలయింది. అది ఆకలి బాధ.

ఆకలి బాధను తట్టుకోవటం వారికి అలవాటే.

అజ్ఞాతవాసంలో వారికి రోజుల తరబడి ఆహారం వుండేదికాదు. ఆకులూ, అలములూ తిని రోజులు గడిపేస్తుండేవారు. ఆ అనుభవాలే ఇరవై గంటల నుండి మొటాంగోనూ అతని సహచరుణ్ని ఈ దేట్లు చేసింది.

మొటాంగో కళ్ళు చిట్లించుకు చూశాడు.

ఏదో వస్తువు కొట్టుకొస్తున్నట్లుగా వుంది.

కళ్ళల్లో ఆశ చిగురించింది.

“ఫ్రెడ్ అటు చూడు.”

“ఏమయింది” కంగారుగా అన్నాడు.

అతనికిప్పుడు ప్రాణాలు పణంగా పెట్టడం మినహాయించి, ఎలాంటి ప్రతిఘటన చేసే ఓపిక లేదు.

“ఏదో చెక్కపలక కొట్టుకొస్తున్నట్టుంది.”

“చెక్కపలకా” అతనిలో ఉత్సాహం తొంగి చూసింది.

“నువ్వు మెల్లగా ఈదుతుండు. నేను చూసొస్తాను.”

“అది వస్తుందిగా.”

“అంతవరకు వేచి వుండలేం ఫ్రెడ్.”

"వెళ్ళిరా మొటాంగో."

మొటాంగో బారలు వేసుకుంటూ సాగిపోయాడు. వారి అదృష్టం బాగుంది. బలమైన చెక్క పలక. దాని మీద ఒకరు పడుకోవచ్చు కూడా. మొటాంగో దాన్ని చూడగానే సంతోషం పట్టలేక బిగ్గరగా అరిచాడు. ఆ స్వరంలోని ఆనందాన్ని గుర్తించాక ఫ్రెడ్‌లో ఉత్సాహం కలిగింది. తనకు తెలియకుండానే వేగంగా ఈదుకుంటూ మొటాంగో దగ్గరకెళ్ళాడు.

"ఇప్పుడు మనం ప్రపంచాన్ని కలుస్తాం ఫ్రెడ్."

"మొటాంగో....రియల్లీ నీ ఆత్మవిశ్వాసమే మనల్ని ఇప్పటిదాకా బ్రతికించింది."

"ఫ్రెడ్. మనం గమ్యం చేరగలమనే నమ్మకం నాకుంది. తిండి లేకుండా ఇంకా మనం కొంతకాలం బతకొచ్చు."

"మొటాంగో యిప్పుడు నాకు చాలా ఆనందంగా వుంది."

"వెల్. నువ్వు చెక్క మీదకు చేరిపో. నేను పట్టుకొని వస్తాను. నాకూ కొంతసేపు రెస్టు దొరుకుతుంది."

"అవును. అలసట తీరాక, నువ్వూ పడుకుందుగాని" అన్నాడు ఫ్రెడ్.

చీకట్లు కమ్ముకొస్తున్నాయి.

'ప్రకృతిలోని ఈ అంశాల్ని, అనుభూతుల్ని అనుభవించటం ఎంత యాదృచ్ఛికం' అనుకున్నాడు మొటాంగో.

సముద్రంలో పలక మెల్లగా కదులుతోంది.

సందర్భమేదైనా అదో అసాధారణ అత్యద్భుత దృశ్యం.

7

నోరు పిడచకట్టుక పోతుంటే ఆకాశంవంక చూశాడు మొటాంగో.

బల్లమీద ఫ్రెడ్ ఈ ప్రపంచాన్ని మరచి నిద్రపోతున్నాడు. అప్పుడప్పుడు అలలు అతన్ని తడుపుతున్నాయి.

మబ్బులు పట్టుకొస్తున్నాయి. వాన కురిస్తే బాగుండు ననుకున్నాడు మొటాంగో. గాలి బాగా వీస్తే మొదటికే మోసం రావచ్చు. అయినా వర్షం రావటాన్నే ఆహ్వానించాడు మొటాంగో.

అతను కన్నార్పకుండా, ఆకాశంవంక, సముద్రంవంక చూస్తున్నాడు. నల్లటి మేఘాలు ప్రళయంలా విరుచుకు పడుతున్నట్లున్నాయి. సముద్రమంతా చీకటి ఆవరించుకొస్తోంది. ఆ మేఘాలు సముద్రంలో ఐక్యం అయి మహా ప్రళయాన్ని సృష్టించబోతున్నాయా అన్నట్లున్నాయి. అవన్నీ దూరంగా సముద్రంలోకి జారిపోతున్నాయా అన్నట్లున్నాయి.

వాటివంకే చూస్తున్నాడు.

సన్నగా చినుకులు మొదలయినాయి.

“ఫ్రెడ్ .... ఫ్రెడ్” కదిపాడు.

ఉలిక్కిపడి లేచాడు.

“ఏమయింది మొటాంగో.”

“వర్షం.... వర్షం వొస్తోంది.”

“అయితే.”

“అయితే ఏమిటి, దోసిటితో పట్టుకొని తాగు ఫ్రెడ్ ఆ నీళ్ళు తియ్యగా వుంటాయి.”

“మంచినీళ్ళు” ఆనందంగా దోసిలి పట్టాడు.

సన్నగా చినుకులు పడుతున్నాయి. దోసిలిపట్టి త్రాగేంతగా కావు.

ఇద్దరూ నోరు తెరిచారు.

ఒక్కో చుక్క నోటిలో పడుతుంటే అంతులేని తన్మయత్వం కలుగుతోంది.

వాన కొంచెం జోరుగా కురవటం ఆరంభమయింది.

ఇప్పుడు దోసిట్లో కొన్ని నీళ్ళు నిలిచాయి.

ఆవురావురుమంటూ వాటిని త్రాగారు.

దాహం తీరుతున్నట్లులేదు. మరలా....మరలా త్రాగుతున్నారు.

ఇద్దరూ నిలువెల్లా తడిసిపోతున్నారు.

నిండా మునిగిన వారికి చలేమిటి!

తమ వంటినంటిన ఉప్పు లవణాల్ని కడుగుతున్నట్లుంది ఆ వాన నీరు.

మంచినీళ్ళు త్రాగాక వారిలో నూతనోత్సాహం వచ్చినట్లయింది.

వాళ్ళు సముద్రంలోకి త్రోయబడి ఎంతకాలమయిందో కూడా వారికి తెలియదు. దాహం తీర్చుకున్నాక వారు కొంచెం సేదతీరారు.

"ఆకలి బాధ తీరేలా కన్పించటంలేదు" అన్నాడు ఫ్రెడ్.

"అవును ఫ్రెడ్. అడవుల్లో అయితే ఏదో ఒకటి దొరుకుతుంది. కానీ సముద్రంలో ఇలా వుంటే ఏం దొరకదు. పడవల్లో అయితే చేపల్ని పట్టుకొని కాల్చుకు తినొచ్చు."

"ఈ ఆకలిని భరించగలమంటావా."

"ఫ్రెడ్, మన బాబీకాండ్స్ ఏళ్ళై రోజులు ఏం

తీసుకోకుండా బ్రతికాడు."

"అది జెలుగోడల నడుమ. కానీ ఈ సముద్ర గాలికి ఆకలి ఎక్కువవుతుంది. పైగా మనం శ్రమిస్తున్నాము. మొటాంగో."

"నిజమే ఫ్రెడ్. అయినా ఏం చెద్దాం చెప్పు."

"ఏం చేద్దాం మొటాంగో. అంతగా ఆకలి భరించ లేకపోతే ఈ చెక్కను చెరోముక్క తిందాం."

"గుడ్ జోక్ ఫ్రెడ్" అభినందించాడు మొటాంగో.

ఫ్రెడ్ అభిమానంగా చూశాడు మొటాంగో వంక.

మొత్తంగా ఈ విజయానికి కారణం మొటాంగో ఆత్మవిశ్వాసంతో కూడిన కృషి. తానయితే నిరాశతో ఎప్పుడో ఈదటం తగ్గించేవాడు. ఆ నీళ్ళు త్రాగి...త్రాగి తాను ఓ కళేబరంలా తయారయ్యేవాడు.

సముద్రంలో తనను ఏ చేపలో పీక్కు తినగా మిగిలిన కట్టె ఏ తీరానికో కొట్టుకుపోయేది.

ఇప్పుడు తాను ప్రశాంతగా కబుర్లు చెబుతున్నాడు. తాము బయటపడగలమనే ఆలోచనే గొప్పది. సాహసంతో కూడుకున్నదీనూ.

అత్యంత పేదరికంలో పుట్టిన మొటాంగో క్రమ క్రమంగా నాయకత్వ స్థానాని కెదిగాడు. అతను మొత్తంగా ప్రపంచ దేశాల రాజకీయాల గురించి వివరిస్తుండేవాడు. మిగతా దేశాల్లోని వ్యక్తుల్లో, పార్టీలతో అతనికి సంబంధాలుండేవి. ఎప్పటికప్పుడు వారికి వారి నుండి సలహాలు అందుతుండేవి.

మొటాంగో నాయకత్వంలో తమను పంపించటానికి కారణం అదే. అతను మొత్తంగా ప్రపంచ ప్రజానీకపు అభిప్రాయాన్ని బలంగా ప్రసరింప చేయగలడనే పార్టీ

అతన్ని ఎంపిక చేసింది.

మొటాంగో రాజకీయంగానే కాకుండా శారీరకంగా కూడా అసమాన బలశాలి. చిన్నప్పటినుండి కాయ కష్టంతో ఆ శరీరం గట్టిపడింది. గుర్రపు స్వారీ.... అడవుల్లో ప్రయాణం.... ఈతకొట్టడం.... ఒక టేమిటి అన్నింటి లోనూ అతనికి ప్రవేశముంది.

దక్షిణాఫ్రికా ప్రభుత్వం అత్యంత ప్రమాదకర వ్యక్తులుగా భావించిన వారిలో మొటాంగో ఒకడు.

అతన్ని బంధించటానికి ఎందరినో చిత్రహింసలకు గురిచేశారు. అయినా ఎవరూ ఆ రహస్యాన్ని బయట పెట్టలేదు.

అతన్ని సజీవంగాగానీ నిర్జీవంగా గాని ఎవరు తెచ్చినా వారికి గొప్ప బహుమతి ప్రకటించింది ప్రభుత్వం.

అలాంటి మొటాంగో తన ముందున్నాడని కెప్టెన్ కు తెలిస్తే ఖచ్చితంగా ఏదో విధంగా ప్రభుత్వానికి అప్ప గించటానికి ప్రయత్నించేవాడు. వాడికి నీగ్రోలమీదున్న అసహ్యమే కాని, ఆ దేశంలో జరుగుతున్న విషయాలు తెలియవు.

లేకుంటే వాడి వికృతరూపం మరో రకంగా వుండేది.

"ఏమిటి ఫ్రెడ్ ఆలోచిస్తున్నావు."

"ఏంలేదు మొటాంగో. అమ్మావాళ్ళు గుర్తొచ్చారు."

మొటాంగో మాట్లాడలేదు.

"మొటాంగో నువ్వు బయటపడితే ... నా తల్లికి నా తుది నమస్కారాలు అందించు."

"ఫ్రెడ్. ఈ సముద్ర జలాల్లో ఈదటంకన్నా నీ మాటలే నాకు బాధాకరంగా వున్నాయి."

"వాస్తవాలు బాధాకరంగానే వుంటాయి. మనమేం

చెయ్యగలం."

"ఫ్రెడ్ నువ్వెందుకో చావు గురించే ఆలోచిస్తున్నావు."

"మృత్యు గ్రహంలోకి వెళ్ళాక మరి దేన్ని గురించి ఆలోచించాలంటావు."

"మన ఆశయాల్ని మరిచావా."

"మరిచిపోవటం ఏమిటి మొటాంగో. మన ఉద్యమాన్ని నిర్దయగా అణిచివేశారు."

"చరిత్రలో ప్రతి అపజయం తర్వాత విజయం వుంది ఫ్రెడ్."

"ఏమైనా నాకు చాలా నిరాశగా వుంది."

"అది సహజమే. వాటన్నింటిని మనం అధిగమించాలి."

"ప్రయత్నిస్తాను" అన్నాడు ఫ్రెడ్.

కొంచెంసేపు నిశ్శబ్దం.

"మొటాంగో కొంచెంసేపు ఇలా వచ్చి దీనిమీద విశ్రాంతి తీసుకో."

"అలాగే ఫ్రెడ్" అన్నాడు మొటాంగో బల్లపైకి చేరుతూ.

8

మధ్య మధ్య ఉలిక్కిపడి లేస్తున్నా, వేడికిరణాలు ముఖంమీద పడుతుంటే మెలకువ వచ్చింది మొటాంగోకి. చెక్క నీటిమీద వాలుగా, వేగంగా ప్రయాణం చేస్తూంది. కళ్ళు విసుచుకుంటూ "ఫ్రెడ్" అంటూ లేచాడు.

సమాధానం లేదు.

అప్పుడు గమనించాడు.

తనను ఒంటరిగా మోసుకెళ్తోంది బల్ల చెక్క.

మొటాంగో గుండెల వేగం హెచ్చింది.

నలువైపులా చూశాడు.

సముద్ర కెరటాలు కనపడుతున్నాయి.

అకస్మాత్తుగా గొంతు చించుకు అరిచాడు.

"ఫ్రెడ్.... ఫ్రెడ్.... ఫ్రెడ్."

ఆ ప్రకృతిలో తిరిగి ఆ శబ్దాలు ప్రతిధ్వనించాయి.

ఏం జరిగింది? ఫ్రెడ్ ఏమయిపోయాడు? ఏ జలచరం బారిన పడ్డాడు? తనెలా మిగిలాడు? ఫ్రెడ్ తననెందుకు లేపలేదు? అన్నీ ప్రశ్నలే! పిచ్చెక్కేటట్లుంది!

"ఫ్రెడ్.... ఫ్రెడ్.... ఫ్రెడ్" పిచ్చెక్కిన వాడిలా అరిచాడు.

ఎలాంటి జవాబు రాలేదు.

గొంతెత్తి బిగ్గరగా ఏడ్చాడు.

"వెళ్ళిపోయారు మీరంతా నన్ను ఒంటరివాడ్ని చేసి వెళ్ళిపోయారు. నేను ఏకాకినయిపోయాను."

వెక్కిళ్ళతో ఏడుస్తున్నాడు మొటాంగో హృదయ విదారంగా.

ప్రకృతి గంభీరంగా వుంది.

అలలు లేచి పడుతున్నాయి.

చెక్క పలక వేగంగా వెళుతూనే వుంది.

సూర్యకిరణాలు ప్రసరిస్తూనే వున్నాయి.

పోరాటమా నువ్వెంత నిర్దయురాలివే!

ఆప్తుల్ని తీసుకుంటావ్.... రక్తం కోరుతావ్.... త్యాగాలు కోరుతావు.... అనుకోని పరిస్థితుల్ని సృష్టిస్తావ్!

పరీక్షిస్తావ్! అహా! నువ్వెంత కఠినురాలివే.

మొటాంగో పిడికిలి బిగుసుకుంది.

"శ్వేత జాతి జాత్యహంకారం."

"నశించాలి."

"జోహార్ అమర వీరులకి."

"జోహార్ వీర జాతికి."

"మానవత్వం వర్ధిల్లాలి."

మొటాంగో కంఠంనుండి పిడుగులు వస్తున్నాయా అన్నట్లుంది. సముద్రం కంపించిపోతుందా అన్నట్లుంది.

చెక్కబల్ల ప్రయాణం చేస్తోంది.

అరిచి.... అరిచి. .. ఏడ్చి. ...ఏడ్చి.....సొమ్మసిల్లి పడిపోయాడు.

నీటి తెమ్మెరలు అతన్ని తడుపుతున్నాయి!

కళ్ళు ఆకాశంలోకి తీక్షణంగా చూస్తున్నాయి.

మొటాంగోకి ఆ తర్వాత ఈ ప్రపంచం గురించే తెలియదు.

* * *

సముద్రతీరంలో కొట్టుకొచ్చిన మొటాంగో శరీరాన్ని తడుపుతూ వెనక్కి వెళుతున్నాయి కెరటాలు.

సూర్యకిరణాలు సూటిగా ముఖంమీద పడుతుంటే మెల్లగా కదిలాడు. సముద్రపు హోరు వినిపిస్తోంది. చల్లటిగాలి అనుభవంలోకి వచ్చింది. మొటాంగోకు ఏం జరిగిందో తెలియదు. తను ఎక్కడున్నాడో అర్థం కావటం లేదు. అతి ప్రయత్నంమీద ప్రక్కకు తిరిగాడు.

దూరంగా చెట్లు కనపడుతున్నాయి. పచ్చదనాన్ని చూడగానే ఒక్కసారి ఓపిక వచ్చింది. బలవంతంగా లేచాడు.

అడుగులు ముందుకు పడుతున్నాయి.

"ప్రపంచాన్ని జయించావు నేస్తం" ఫ్రెడ్ చెవిలో చెవిలో చెబుతున్నట్లుంది.

"విదేశాలనుండి మీారు పోరాటం జరపాలి" చెవిలో ఏవేవో ధ్వనులు.

అవే మొటాంగోను నడిపిస్తున్నాయి.

దూరంగా చెట్లకు కనపడుతున్న ఫలాల్ని చూశాడు.

అదే దేశమో! ఏ ప్రాంతమో!

అయినా మొటాంగో ముందుకే నడుస్తున్నాడు.

"పోరాటం ఆపమించదు" పిడికిలి బిగించాడు ఎర్ర బారిన నేత్రాలతో.

—:అ యి పో యిం ది:—